క్లుప్తంగా

మార్కెట్ స్థలంలో అక్రమ కట్టడాలపై ఫిర్యాదు

రావికమతం: కొత్తకోట మార్కెట్ స్థలంలో పంచాయతీ తీర్మానాలు, వేలం పాట లేకుండానే ఇష్టారీతిన పలువురు వ్యాపారులు శాశ్వత కట్టడాలు చేపడుతున్నారని గ్రామానికి చెందిన బీజేపీ, టీడీపీ నాయకులు ఎంపీడీవో భానోజీ రావుకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఇటీవల మార్కెట్ యార్డును అభివృద్ధి చేసి మార్కెట్‌ను అక్కడికి తరలించాక, ఆ స్థలానికి డిమాండ్ పెరిగిందన్నారు. దానిని అవకాశంగా చేసుకుని పంచాయతీ పాలకులు ప్రభుత్వానికి ఆదాయం లేకుండా ఒక్కో వ్యాపారి నుంచి మామూళ్లు ఆశించి, స్థలాలను ఇచ్చేస్తున్నారరని ఫిర్యాదులో పేర్కొన్నారు. తక్షణమే విచారణ వాటిని ఆపాలని కోరారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గల్లా రాజేశ్వరరావు, టీడీపీ నాయకులు సత్యనారాయణ, శ్రీను పాల్గొన్నారు.

చిట్టిచేతుల చిరు సాయం


నిత్యావసర వస్తువులు అందిస్తున్న విద్యార్థులు

మాకవరపాలెం: తల్లిదండ్రులులేని విద్యార్థులకు తోటి విద్యార్థులు చిరు సాయం అందించారు. తూటిపాల ప్రాథమికోన్నత పాఠశాలలో చదువుతున దినేష్, హిమజయలకు తల్లిదండ్రులు లేరు. వీరికి తోటి విద్యార్థులు వెంకట మోహన్, శ్రీలత, సాయిగణేష్‌దివ్య, తేజశ్విని, శ్రీలత, ఉమామహేంద్ర, తేజ కలసి పది కేజీల బియ్యంతోపాటు ఇతర నిత్యావసర సరుకులు శుక్రవారం అందించారు. ఈ సందర్భంగా హెచ్ఎం కోసూరు రాము మాట్లాడుతూ చిన్ననాటి నుంచి సేవా భావం కలిగి ఉండాలని విద్యార్థులకు సూచించారు. ఆయనతోపాటు ఉపాధ్యాయులు లోవరాజు, సంతోషి అభినందించారు.

28వ తేదీ వరకు సామాజిక తనిఖీలు

మాకవరపాలెం: మండలంలో ఉపాధి పనులపై ఈ నెల 16 నుంచి 28వ తేదీ వరకు సామాజిక తనిఖీలు నిర్వహిస్తున్నట్టు ఇన్‌చార్జి ఎంపీడీవో జాన్‌లింకన్ శుక్రవారం తెలిపారు. 2022–23 ఆర్థిక సంవత్సరంలో నిర్వహించిన పనులపై 31 పంచాయతీల పరిధిలో తనిఖీలు చేస్తారన్నారు. ఎక్కడైనా పనుల్లో అవకతవకలు జరిగితే కూలీలు, ప్రజలు తనిఖీ బృందాలకు నిర్భయంగా తెలియజేయవచ్చన్నారు. తనిఖీల్లో గుర్తించిన అవకతవకలను వెల్లడించేందుకు 29న ప్రజావేదిక నిర్వహిస్తామన్నారు.

భవన నిర్మాణాలు యుద్ధప్రాతిపదికన పూర్తి


మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి లక్ష్మి

నాతవరం: మండలంలో అసంపూర్తిగా ఉన్న నూతన భవన నిర్మాణాలు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారి జి.వి.లక్ష్మి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఆమె మండల స్థాయి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సచివాలయ, ఆర్బీకే, హెల్త్ క్లినిక్ భవన నిర్మాణాలు సకాలంలో పూర్తి చేయాలన్నారు. జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేసేందుకు హౌసింగ్ సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రభుత్వం ఇంకుడు గుంతకు రూ.6 వేలు, మరుగుదొడ్డికి రూ.12 వేలు చొప్పున లబ్ధిదారులకు అదనంగా ఇస్తుందన్నారు. ఉచితంగా విద్యుత్ మీటరు, తాగునీటి కుళాయి ఏర్పాటు చేస్తుందన్నారు. వేసవిలో తాగునీటి సమస్య ఉండే గ్రామాల్లో 15వ ఆర్థిక సంఘం నిధులతో కొత్తగా బోర్లు ఏర్పాటు చేయాలన్నారు. ఎంపీడీవో జె.రాంబాబు, జేఈలు జోగారావు, వెంకటేశ్వరమ్మ పాల్గొన్నారు.

పాఠశాలలో ఆర్వోప్లాంటు ప్రారంభం


ఆర్వో ప్లాంటును ప్రారంభిస్తున్న సర్పంచ్, ఇన్‌చార్జి హెచ్ఎం

రోలుగుంట: నాడు–నేడు పథకం కింద కుసుర్లపూడి జెడ్పీ ఉన్నత పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పన కోసం రూ.9 లక్షలు మంజూరయ్యాయి. ఈ నిధులతో రూ.లక్షతో ఆర్వోప్లాంటు, రూ.8 లక్షలతో టాయిలెట్స్–8, యురినల్స్– 19 నిర్మించారు. వీటిని సర్పంచ్ మడ్డు అప్పలనాయుడు, ఇన్‌చార్జి హెచ్ఎం విద్యావతి శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ చైర్మన్ గొల్లు రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రగతి పథాన పల్లెలు


చౌడువాడలో సిమెంట్ రోడ్డుగా మారిన శెరీరోడ్డు


చౌడువాడలో నిర్మాణం పూర్తయిన సచివాలయ భవనం


ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఆర్బీకే భవనం

- 10 గ్రామాల్లో రూ.15.51 కోట్లతో పూర్తయిన అభివృద్ధి పనులు
- నేడు ప్రారంభించనున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు


రొంగలినాయుడుపాలెంలో ప్రారంభోత్సవానికి సిద్ధమవుతున్న వైఎస్సార్ హెల్త్‌క్లినిక్ భవనం


పాతవలసలో నిర్మాణం పూర్తయిన మంచినీటి పథకం

కె.కోటపాడు: వైఎస్సార్‌సీపీ పాలనలో గ్రామాలు ప్రగతికి ప్రతిరూపాలుగా నిలుస్తున్నాయి. ఒకప్పుడు అరకొర సౌకర్యాలతో అధ్వాన రోడ్లతో దర్శనమిచ్చేవి. ఇప్పుడు ఏ గ్రామ పంచాయతీకి వెళ్లినా పౌరసేవలందించేందుకు సచివాలయాలు, రైతన్నలకు ఆర్బీకేలు, మెరుగైన వైద్య సేవలకు వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు అందుబాటులోకి వచ్చాయి. జలజీవన్ మిషన్ నిధులతో ఏర్పాటైన కుళాయిలతో ఇంటింటికీ సురక్షిత నీరందుతోంది. వెరసి పల్లెలు సమగ్రాభివృద్ధితో కళకళలాడుతున్నాయి.

అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు

మండలంలోని పది గ్రామాల్లో రూ.15.51 కోట్లతో పూర్తయిన అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ముఖ్యఅతిథిగా హాజరై శనివారం వీటిని ప్రారంభించనున్నారు. మేడిచర్ల, ఎ.భీమవరం కాటా వద్ద రూ.1.8 కోట్లతో మంచి నీటి ట్యాంకులతోపాటు సీసీ రోడ్లు, రొంగలినాయుడుపాలెం, గొర్రుపోటువానిపాలెంలో సచివాలయం, ఆర్బీకే, హెల్త్ వెల్‌నెస్ భవనాలు, మంచినీటి ట్యాంకు, చౌడువాడలో రూ.5.36 కోట్లతో సీసీ రోడ్లు, సామాజిక భవనం, రెండు సచివాలయ భవనాలు, రెండు ఆర్బీకే భవనాలను నిర్మించారు. వీటితోపాటు మల్లంపాలెం–చౌడువాడ గ్రామాల మధ్య రూ.2.40 కోట్లతో రోడ్డు నిర్మాణ పనులు శిలాఫలకాన్ని ఆవిష్కరించనున్నారు. మల్లంపాలెంలో రూ.67లక్షలతో సిమెంట్ రోడ్లు, ఇంటింటి కుళాయి పైప్‌లైన్ ప్రారంభం, పాచిలవానిపాలెంలో రూ.80 లక్షలతో పూర్తయిన మంచినీటి ట్యాంకు, పైపులైన్, సీసీ రోడ్లను, ఆర్లిలో రూ.45 లక్షలతో సచివాలయం, హెల్త్ వెల్‌నెస్ భవనాలు, దాలివలసలో రూ.1.16 కోట్లతో మంచినీటి ట్యాంకు, పైపులైన్ విస్తరణ, గ్రామ సచివాలయం, హెల్త్ వెల్‌నెస్ భవనాలు, పిండ్రంగిలో రూ.1.26 కోట్లతో మంచి నీటి ట్యాంకు, గ్రామ సచివాలయం, ఆర్బీకే భవనాలు, పాతవలసలో రూ.60 లక్షలతో మంచినీటి ట్యాంకు నిర్మించి ఇంటింటి కుళాయిలు ఏర్పాటు చేశారు. వీటి ప్రారంభోత్సవానికి ప్రజాప్రతినిధులు, అధికారులు ఏర్పాట్లను చేశారు. గ్రామాల్లో ఎనలేని అభివృద్ధి చేసి సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి, డిప్యూటీ సీఎం బూడికి కృతజ్ఞతలు చెబుతున్నారు.

నీటి ఇక్కట్లు తీరాయి



మా గ్రామంలో సచివాలయం, వెల్‌నెస్, ఆర్బీకే భవనాలు, ఇంటింటికీ కుళాయి పనులు పూర్తయ్యాయి. అంతర్గత మట్టిరోడ్లను సీసీరోడ్లుగా నిర్మించాం. శివారు గ్రామం గొర్రుపోటువానిపాలెంలో మంచినీటి ట్యాంకు నిర్మించి ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా చేశాం. డిప్యూటీ సీఎం బూడి సహకారంతో పనులను పూర్తి చేసుకున్నాం.

– పైల పైడితల్లమ్మ, సర్పంచ్, రొంగలినాయుడుపాలెం

సీసీ రోడ్డుగా రూపాంతరం



చౌడువాడలో గవరపేట నుంచి శెరీరోడ్డుకు వెళ్లాలంటే మూడ డుగుల గోర్జు గుండా ఇబ్బందులు పడేవాళ్లం. ఇక్కడ కష్టాలను డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడుకు విన్నవించగా, ఆయన నెలల వ్యవధిలోనే సిమెంట్ రోడ్డు నిర్మాణానికి రూ.50 లక్షలు మంజూరు చేశారు. రోడ్డు పూర్తవడంతో ఈ మార్గంలో నడుస్తున్న ప్రజలంతా ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఆయనకు కృతజ్ఞతలను చెబుతున్నారు.

– తనకల అప్పలకోటి, రైతు, చౌడువాడ

డ్రైనేజీ వ్యవస్థ మెరుగుపర్చేందుకు కృషి

దేవరాపల్లిలో డిప్యూటీ సీఎం బూడి పరిశీలన


దేవరాపల్లి సచివాలయం వద్ద డ్రైనేజీని పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

దేవరాపల్లి: డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు శుక్రవారం దేవరాపల్లిలో పర్యటించారు. పలు వీధుల్లో తిరిగి డ్రైనేజీ వ్యవస్థను పరిశీలించారు. సచివాలయం–1 ఆనుకుని ప్రధాన డ్రైనేజీ నిర్మాణానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఇంజీరింగ్ సిబ్బందికి పలు సలహాలు, సూచనలు చేశారు. నూతన ఎంపీడీవో భవనాన్ని పరిశీలించి, కార్యాలయంలో ప్రజాప్రతినిధులకు, అధికారులకు ఫర్నిచర్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఎరుకుల పేట నుంచి నూతన ఎంపీడీవో భవనం పక్క నుంచి నిర్మిస్తున్న పైపులైన్ డ్రైనేజీ పనులను పర్యవేక్షించారు. నాణ్యత ప్రమాణాల్లో రాజీ పడకుండా పక్కాగా పనులు చేపట్టాలని ఆదేశించారు. ఇప్పటికే దాదాపుగా అన్ని ప్రధాన వీధులతోపాటు శివారు ప్రాంతాలకు సైతం సీసీ రోడ్లు నిర్మించామని, ఇకపై డ్రైనేజీల నిర్మాణంపై దృష్టి సారించి మెరుగుపరుస్తానని స్పష్టం చేశారు. ఈయన వెంట వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కిలపర్తి భాస్కరరావు, కొప్పుల వెలమ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ డాక్టరు వరదపురెడ్డి సింహాచలంనాయుడు, రైవాడ మాజీ సర్పంచ్ చల్లా తాతయ్యలు, సబ్బవరపు మాలిబాబు, వాలేటి నాగరాజు, చల్లా నాయుడు ఉన్నారు.

వలంటీర్లకు ఘన సత్కారం


తామరబ్బలో వలంటీర్లను సత్కరిస్తున్న ఎంపీడీవో

దేవరాపల్లి: ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా ఉంటూ వలంటీర్లు అందిస్తున్న సేవలు అభినందనీయమని ఎంపీడీవో సిహెచ్.సుబ్బలక్ష్మి అన్నారు. వలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా చింతలపూడి సచివాలయం పరిధి తామరబ్బ పంచాయతీ లో సర్పంచ్ టోకురి రామకృష్ణ సమక్షంలో ఎంపీడీవో, దేవరాపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి ఇ.పూజ్య మేఘన, తెనుగుపూడిలో ఉప సర్పంచ్ కాటిపాం పెదనాయుడు, ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ జి.సంతోషి నళిని వలంటీర్లను ఘనంగా సత్కరించారు. గరిశింగిలో సర్పంచ్ గూడెపు రాము, రైవాడలో సర్పంచ్ చల్లా లక్ష్మి, మారేపల్లిలో సర్పంచ్ అవుగడ్డ కన్నతల్లి, సీనియర్ నాయకుడు అవుగడ్డ రామ్మూర్తినాయుడు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. తామరబ్బలో ఎంపీడీవో సుబ్బలక్ష్మి మాట్లాడుతూ దేవరాపల్లిలో 327 మంది వలంటీర్లకుగాను దేవరాపల్లి –2 సచివాలయానికి చెందిన పిల్లా రాజు సేవా వజ్ర అవార్డుకు, సేవా రత్న అవార్డులకు కందుల పరమేశ్వరి(దేవరాపల్లి), కొయ్యాన రమణ(రైవాడ), గోకాడ గంగునాయుడు (పెదనందిపల్లి), పాటిల సన్యాసిరావు(తెనుగుపూడి), చిరికి సంతోష్‌కుమార్(కొత్తపెంట) ఎంపికయ్యారన్నారు. 321 మంది సేవా మిత్ర అవార్డుకు ఎంపికయ్యారన్నారు. సేవా వజ్రకు రూ.45 వేలు, సేవా రత్నకు రూ.30 వేలు, సేవా మిత్రకు రూ.15 వేల చొప్పున అందజేస్తున్నట్లు తెలిపారు. తామరబ్బ, గరిశింగి, రైవాడ పంచా యతీ కార్యదర్శులు ఎల్. లింగన్న, యశోద, లక్ష్మి పాల్గొన్నారు.

తురువోలు- తంగుడుబిల్లి తారురోడ్డు ప్రారంభం


శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

చీడికాడ: తారురోడ్ల నిర్మాణంతో గ్రామాలు అనుసంధానం కావడంతోపాటు రూపురేఖలు మారుతున్నాయని ఎంపీపీ కురచా జయమ్మ అన్నారు. తురువోలు–తంగుడుబిల్లి వరకు మూడు కిలోమీటర్ల మేర రూ.1.60 కోట్లతో నిర్మించిన తారురోడ్డు శిలాఫలకాన్ని జెడ్పీటీసీ లాలం శరదా జానకీరాంతో కలిసి శుక్రవారం ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండు గ్రామాల రైతుల ఇబ్బందులను డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు దృష్టికి తీసుకెళ్లగా, నిధులు మంజూరు చేశారన్నారు. వీటితో రోడ్డు నిర్మాణం శరవేగంగా పూర్తి చేసుకుందన్నారు. రెండు గ్రామాల తరఫున సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి, డిప్యూటీ సీఎంకు రుణపడి ఉంటామన్నారు. సర్పంచ్ మట్టా అప్పారావు, ఉప సర్పంచ్ పి.టి.బాబు, ఆర్మీ నాయుడు, చొక్కాకుల కోటి, లాలం శివకుమార్, గంటాన అప్పారావు పాల్గొన్నారు.

సూర్యచంద్రుల దేవాలయంలో రథసప్తమి పూజలు

విద్యార్థుల సామూహిక సూర్యనమస్కారాలు


సామూహికంగా సూర్యనమస్కారాలు చేస్తున్న విద్యార్థులు

చోడవరం: గౌరీపట్నం సమీపంలో పెద్దేరు నది ఒడ్డున సూర్యచంద్రుల దేవాలయంలో శుక్రవారం భక్తులు రథసప్తమి పూజలు చేశారు. చోడవరం పరిసర గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి స్వామివారికి పూజలు చేసి, దీపాలు వెలిగించారు. అనకాపల్లి మండలం రాజుపాలెంలో సూర్యనారాయణమూర్తి దేవాలయంలో స్వామివారిని చోడవరం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. స్థానిక వాకర్స్ క్లబ్ ఆవరణంలో రథసప్తమి సందర్భంగా విద్యార్థులంతా కలిసి సామూహిక సూర్యనమస్కారాలు చేశారు. 200మంది విద్యార్థులు ఒకే చోట చేరి 108 సూర్యనమస్కారాలు చేశారు. యోగా గురువు అల్లెపు శ్రీనివాసరావు పర్యవేక్షణ లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. యోగా గురువు మాట్లాడుతూ సూర్యనమస్కారాలతో యోగా చేయడం వల్ల మంచి శరీర సౌష్టవంతోపాటు ఆరోగ్యాన్ని పొందుతారన్నారు. మానసిక ఒత్తిళ్ల నుంచి సూర్యనమస్కారాలు రక్షిస్తాయని సూచించారు. సూర్యరశ్మి శరీరానికి తగటం వల్ల మనిషికి కావలసిన డి. విటమిన్ పొందవచ్చునన్నా రు. పతంజలి యోగా కేంద్రం ఆధ్వర్యంలో చోడ వరం ఉషోదయ విద్యా సంస్థల ఆవరణంలో సామూహిక సూర్యనమస్కారాలు చేశారు. విద్యార్థులు, పెద్దలు అంతా కలిసి యోగాతో కూడిన 108 సూర్యనమస్కారాలు చేశారు. యోగా గురువు పుల్లేటి సతీష్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

అర్హతే కొలమానంగా సంక్షేమ పథకాలు

- మాడుగుల ఎంపీపీ రాజారామ్


మాట్లాడుతున్న ఎంపీపీ రాజారామ్ తదితరులు

మాడుగుల: అర్హతే కొలమానంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేయాలని ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకట రాజారామ్ అన్నారు. శుక్రవారం జమ్మాదేవిపేటలో సత్యవరం, జేడీపేట, జాలంపల్లి, ఎల్. పొన్నవోలు గ్రామాల వలంటీర్లకు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులై ఉండి ఇంకా ప్రభుత్వ పథకాలు అందకపోతే వెంటనే నమోదు చేసి వారికి అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. కులగణన సర్వే, ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్ భారత్‌లో తప్పులు దొర్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఆర్. కాశీప్రసాద్, సర్పంచ్ కొసిరెడ్డి కృష్ణమూర్తి, ఎంపీటీసీ తలారి అప్పారావు, ఈవోపీఆర్డీ మీనాకుమారి, పంచాయతీ కార్యదర్శి వెచ్చా రమేష్ పాల్గొన్నారు.

ప్రభుత్వానికి పేరు తెచ్చేలా పనిచేయాలి

ఎంపీపీ సుర్ల రాజేశ్వరి


మాట్లాడుతున్న ఎంపీపీ సుర్ల రాజేశ్వరి

నర్సీపట్నం: ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమాన్ని సమర్థవంతంగా అమలు చేసి ప్రభుత్వానికి పేరు తీసుకురావాలని ఎంపీపీ సుర్ల రాజేశ్వరి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ ఫలాలు అర్హులకు అందేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. వచ్చేది వేసవి దృష్టిలో ఉంచుకుని ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడకుండా ముందుస్తు కార్యాచరణ రూపొందించాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు సూచించారు. జలజీవన్ మిషన్ పథకంలో 120 ట్యాప్‌లు వేశారని, అవి పాడైపోయిన కాంట్రాక్టర్ పట్టించుకోవటం లేదని ధర్మసాగరం సర్పంచ్ గొంప కన్నయ్యనాయుడు ఎంపీపీ దృష్టికి తీసుకెళ్లారు. సమస్యను పరిష్కరించాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శిరీషాను ఎంపీపీ ఆదేశించారు. సమావేశంలో వైస్ ఎంపీపీలు తాతబాబు, ఇన్న రత్నం, ఎంపీడీవో జాన్ లింకన్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గౌరీపట్నంలో తాగునీటి సమస్య పరిష్కారం

ఇంటింటి కుళాయిల ప్రారంభోత్సవంలో ప్రభుత్వ విప్ ధర్మశ్రీ


ఇంటింటి కుళాయిలను ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

చోడవరం: సుదీర్ఘకాలం పాటు గౌరీపట్నంలో ప్రజలు ఎదుర్కొంటున్న మంచినీటి సమస్య పరిష్కారమైంది. రూ.2.40 కోట్లతో నిర్మించిన మంచి నీటి ట్యాంక్, ఇంటింటి కుళాయిలను ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ శుక్రవారం ప్రారంభించారు. గత ఎన్నికల ముందు వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఇక్కడ ప్రజల మంచినీటి సమస్య పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఆ ప్రకారం జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా గ్రామంలో 540 ఇళ్లకు కుళాయి కనెక్షన్లు ఇవ్వడమే కాకుండా కొత్తగా రూ.40 లక్షలతో మంచినీటి ఓవర్‌హెడ్ ట్యాంక్‌ను నిర్మించారు. వీటిని ఆయన ప్రారంభించారు. అన్ని విధాలుగా ప్రజల సమస్యలు పరిష్కరిండంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎంతో కృషి చేసిందన్నారు. అభివృద్ధి, సంక్షేమానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారన్నారు. ఐదేళ్లలో సుభిక్ష పాలన అందించిన తమ పార్టీని రానున్న ఎన్నికల్లో తిరిగి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కోన చంద్రరావు, ఎంపీటీసీ మంగ జగన్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ శివకృష్ణ, ఏఈ కనకమ్మ, ఎంపీపీ గాడి కాసు పాల్గొన్నారు.

మేడివాడలో యువకుల ర్యాలీ

రావికమతం: రాజకీయం వద్దు.. రామాలయం ముద్దు అంటూ శుక్రవారం మేడివాడలో యువకులు ర్యాలీ చేశారు. గ్రామంలో రామాలయం జీర్ణోద్ధరణకు గురైంది. దీని స్థానంలో నూతన రామాలయం నిర్మించడానికి పార్టీలకతీతంగా అందరూ నడుం కట్టాలని, దేవుని విషయంలో ఎవ్వరూ ఎటువంటి రాజకీయాలు చేయవద్దంటూ భక్తాంజనేయ మాలలు ధరించిన యువకు లు నినాదాలు చేశారు.

ఆరోగ్య సురక్ష రోగులకు వరం


రోగులను పరీక్షిస్తున్న ఆర్థోపెడిక్ డాక్టరు నందకిశోర్


రోలుగుంట: రోగికి కేస్ షీట్ అందజేస్తున్న వైద్యాధికారి శ్రీనివాసరాజు

చీడికాడ: జగనన్న ఆరోగ్య సురక్ష రోగులకు వరమని ఎంపీపీ కురచా జయమ్మ అన్నారు. శుక్రవారం కోనాంలో సురక్ష శిబిరాన్ని జెడ్పీటీసీ లాలం శారదా జానకీరాంతో కలిసి ఆమె ప్రారంభించారు. వైద్య సిబ్బంది 326 మంది రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. వీరిలో ఐదుగురిని వైఎస్సార్ కంటి వెలుగులో భాగంగా కంటి శుక్లాల తొలగింపునకు ఆస్పత్రికి తరలించారు. సర్పంచ్ సలుగు ఈశ్వరమ్మ, వైస్ ఎంపీపీ చిన్నమ్మలు పాల్గొన్నారు.

మాకవరపాలెం: వజ్రగడ ప్రాథమిక పాఠశాల ఆవరణలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం–2 నిర్వహించారు. ఈ సందర్భంగా వజ్రగడ, తమ్మయ్యపాలెం, చంద్రయ్యపాలెం, శ్రీరాంపురం గ్రామాల నుంచి వచ్చిన 362 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్యాధికారి సీతారామలక్ష్మి, సీహెచ్‌వో రామచంద్రరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రోలుగుంట: బుచ్చింపేట పీహెచ్‌సీ పరిధి రత్నంపేటలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష–2 శిబిరాన్ని నిర్వహించారు. వివిధ రోగాలకు సంబంధించిన 305 రోగులకు వైద్యులు శ్రీనివాసరాజు (జనరల్), అభిరామ్(సర్జన్), అనీష (గైనికాలజిస్ట్) పరీక్షించి మందులు ఉచితంగా పంపిణీ చేశారు.

కె.కోటపాడు: గుల్లేపల్లిలో జగన్న ఆరోగ్య సురక్ష–2 శిబిరాన్ని సర్పంచ్ బండారు దేముళ్లు ప్రారంభించారు. చౌడువాడ పీహెచ్‌సీ వైద్యాధికారి సుబ్రహ్మణ్యం, ఆర్థోపెడిక్ డాక్టరు నందకిశోర్, గైనికాలజిస్టు కల్యాణి, ఆప్తాలమిస్టు రాజీవ్ 269 మంది రోగులను పరీక్షించారు.

కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా కార్మికుల ఆందోళన


నర్సీపట్నంలో ర్యాలీ చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

నర్సీపట్నం/చోడవరం/మాడుగుల/రూరల్/కె.కోటపాడు/బుచ్చెయ్యపేట: కార్మికులను, రైతులను కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని, వెంటనే గద్దె దిగాలని డిమాండ్ చేస్తూ కార్మిక సంఘాలు, కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు శుక్రవారం ఆందోళన చేశారు. గ్రామీణ భారత్ బంద్‌ను పురస్కరించుకొని దేశవ్యాప్త ఆందోళనలో భాగంగా నర్సీపట్నం, చోడవరం, మాడుగుల నియోజకవర్గాల్లోని అన్ని మండలాల్లో కార్మిక సంఘాలు, మధ్యాహ్నం భోజన కమిటీలు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టాయి. ర్యాలీలు నిర్వహించి మానవహారంగా ఏర్పడి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశాయి. సీపీఐ, సీఐటీయూ జిల్లా కార్యదర్శులు .బాలెపల్లి వెంకటరమణ, అడిగర్ల రాజు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు


నాతవరం: సిబ్బందికి సూచనలు చేస్తున్న తహసీల్దార్ రమేష్‌కుమార్


మాడుగుల: వీరనారాయణంలో అవగాహన కల్పిస్తున్న తహసీల్దారు సత్యనారాయణ

మాడుగుల: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో దివ్యాంగులు ఓటు హక్కును వినియోగించడానికి సదుపాయాలు కల్పిస్తున్నారని తహసీల్దారు టి. సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం వీరనారాయణం, సాగరం గ్రామాల్లో 65, 66, 08, పోలింగ్ కేంద్రాల్లో దివ్యాంగులకు ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. ఎన్నికల డీటీ రాజా, ఆర్ఐలు, వెంకటేష్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నాతవరం: పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లు చేస్తున్నామని తహసీల్దార్ ఎస్.రమేష్‌కుమార్ తెలిపారు. మర్రిపాలెం, డి.యర్రవరం, ములగపూడి గ్రామాల్లో పోలింగ్ బూత్‌లను ఆయన పరిశీలించారు. ఆర్ఐ హరి, సిబ్బంది పాల్గొన్నారు.

రావికమతం: కవగుంట పోలింగ్ బూత్‌ల్లో శుక్రవారం మాక్ ఓటింగ్ నిర్వహించారు. ఆర్ఐ సతీష్, వీఆర్వోలు, గ్రామ రెవెన్యూ సహాయకులు పాల్గొని ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్‌పై అవగాహన కల్పించారు.

ఉత్సాహంగా గుర్రాల పరుగు పోటీలు


పోటీల్లో పరుగులు తీస్తున్న గుర్రం

మాడుగుల రూరల్: రథసప్తమి సందర్భంగా కె.జె.పురం దబ్బకుంటు రహదారిలో మసమ్మాతల్లి తీర్థం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులు 101 ఘటాలతో ఊరేగింపుగా ఆలయానికి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశారు. సాయంత్రం జూనియర్ ఎడ్లబళ్లతోపాటు గుర్రం పరుగు పోటీలు నిర్వహించారు. విజేతలకు దాతల సహకారంతో ఉత్సవ కమిటీ సభ్యులు బహుమతులు అందజేశారు. అమ్మవారిని పైలా ప్రసాదురావు, తదితరులు దర్శించుకున్నారు.

ఘనంగా వీరాంజనేయ తీర్థం

ముకుందపురంలో వీరాంజనేయ తీర్థం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆలయం వద్ద అన్నసమారాధన ఏర్పాటు చేశారు. సాయంత్రం పాటలు, ముగ్గులు, బైక్ స్లో పోటీలు, కోలాటం నిర్వహించారు.

స్థలం ఆక్రమణపై తహసీల్దారుకు ఫిర్యాదు


చింతపాక జంక్షన్‌లో ఆక్రమణకు గురవుతున్న స్థలం

బుచ్చెయ్యపేట: మండలంలో చింతపాక జంక్షన్ బస్సు షెల్టర్ వద్ద స్థలాన్ని ఆక్రమణకు గురికాకుండా చూడాలని గ్రామ సర్పంచ్ గొలజాన శ్రీను తహసీల్దార్ శ్రీకాంత్‌కు శుక్రవారం ఫిర్యాదు చేశారు. బస్సు షెల్టర్ ఎదురుగా రోడ్డు నిర్మాణం కోసం గతంలో కరక గ్రామానికి చెందిన యన్నెంశెట్టి రాములు ఈ స్థలాన్ని దానంగా ఇచ్చారన్నారు. కొంతమంది దీన్ని ఆక్రమించి అమ్మకాలు చేయడానికి చూస్తున్నారన్నారు. తక్షణమే ఆక్రమణకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు.